క్లుప్తంగా

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

నాగారం : ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఎద్దు మృతి చెందిన సంఘటన ఫణిగిరిలో గురువారం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఫణిగిరి గ్రామానికి చెందిన రైతు రావుల మల్లయ్య రోజు వారిగానే తన పశువులను వ్యవసాయక్షేత్రంలోకి మేతకు తోలుకెళ్లాడు. ఎద్దు మేత మేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఈ గేదె విలువ సుమారు రూ.70వేలు వరకు ఉంటుందని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని బాధితుడు కోరారు.

దుర్గం ప్రభాకర్‌కు సర్వీస్ లెజెండరీ అవార్డు


అవార్డు అందజేస్తున్న ఇందిర ఆర్ట్స్ ఫౌండేషన్ సభ్యులు

చివ్వెంల : చివ్వెంల మండల పరిధిలోని ఖాసీంపేటలో బెతెస్థ మినిస్ట్రీస్ ప్రార్థన మందిరం వ్యవస్థాపకుడు, పాస్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దుర్గం ప్రభాకర్ సర్వీస్ లెజెండరి అవార్డ్–2023 అందుకున్నారు. వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారికి హైదరాబాద్‌లోని ఇందిర ఆర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం అవార్డులు అందిస్తుంటారు. ఈ క్రమంలో సేవారంగంలో చేసిన విశిష్టతకు దుర్గం ప్రభాకర్‌కు అవార్డు అందించారు. హైదరాబాద్‌లోని త్యాగరాయ గాన సభలో ఈ అవార్డు అందుకున్నారు. అవార్డుతోపాటు ప్రశంసపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దుర్గం ప్రభాకర్‌ను మండల, జిల్లా క్రైస్తవ నాయకులు అభినందించారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ


లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

నూతనకల్ : ఆడపిల్లలకు కల్యాణలక్ష్మి వరం లాంటిదని ఎంపీపీ భూరెడ్డి కళావతిసంజీవరెడ్డి, జెడ్పీటీసీ కందాల దామోదర్‌రెడ్డి అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సమాజంలో తల్లిదండ్రులకు ఆడపిల్లలు భారంగా మారకూడదని సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎండీ జమీరుద్దీన్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టులు దెబ్బతిని రాకపోకలకు ఇబ్బందులు


తిమ్మాపురం - సంగెం రోడ్డుపై కొమ్మాల సమీపంలో దెబ్బతిన్న కల్వర్టు

అర్వపల్లి : తిమ్మాపురం–సంగెం ప్రధాన రహదారిపై కొమ్మాల, కోదూరు, సంగెం తదితర ప్రాంతాల్లో కల్వర్టులు పూర్తిగా ధ్వంసమై రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ కల్వర్టులపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. కనీసం పాదచారులు సైతం నడిచి వెళ్లలేని విధంగా ఈ కల్వర్టులు మారాయి. వర్షాలు పడిన ప్రతిసారి వాగులు పొంగి రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నూతనంగా వంతెనలు నిర్మించి ఇబ్బందులు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

మూసీ ప్రాజెక్టును సందర్శించిన ఎన్నికల అధికారి


ప్రాజెక్టును సందర్శించిన జాయింట్ చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ రాఘవేంద్ర

సూర్యాపేట రూరల్ : మండలంలోని రత్నపురం గ్రామ సమీపంలోగల మూసీ ప్రాజెక్టును జాయింట్ చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ రాఘవేంద్ర గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మూసీ ప్రాజెక్టు చరిత్ర, నీటి సామర్థ్యం, ఆయకట్టు సాగు గురించి మూసీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ డీఎం రాంపతినాయక్, తహసీల్దార్ వెంకన్న, ఏఈ ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా 'పల్లెప్రగతి' వేడుకలు


ఆత్మకూర్(ఎస్) : ఏపూరులో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది


సూర్యాపేట రూరల్ : ఇమాంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు


నూతనకల్‌లో జెండా ఎగురవేస్తున్న సర్పంచ్ తీగల కరుణశ్రీగిరిధర్‌రెడ్డి

తుంగతుర్తి : తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం పల్లె ప్రగతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌లు జాతీయ జెండాలను ఆవిష్కరించి, ర్యాలీ నిర్వహించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులను శాలువాలతో సన్మానించి, ప్రశంసపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుండగాని కవిత రాములుగౌడ్, ఎంపీడీఓ భీంసింగ్, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, సర్పంచ్‌లు నల్లు రామచంద్రారెడ్డి, గుజ్జ పూలమ్మ, యాకునాయక్, నకిరేకంటి విజయ్, అబ్బగాని పద్మసత్యనారాయణ, వెంకన్న, బీఆర్‌ఎస్ నాయకులు తాటికొండ సీతయ్య, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే దేశ అభివృద్ధి

ఆత్మకూర్ (ఎస్) : గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని, గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లు కృషిచేయాలని ఎంపీడీఓ మల్సూర్‌నాయక్ అన్నారు. జాతీయ ఉత్తమ అవార్డు గ్రామమైన ఏపూరు గ్రామంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన పల్లె ప్రగతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించి, గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఏపూరు గ్రామం జాతీయ స్థాయిలో అవార్డు పొందడం గ్రామ అభివృద్ధికి, పని తనానికి నిదర్శనమన్నారు. సర్పంచ్‌లు, అధికారులు సమన్వయంతో పనిచేసినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ సిబ్బందికి దుస్తులు, పారిశుద్ధ్య పనులు చేయుటకు కిట్స్ అందజేసి వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సానబోయిన రజిత సుధాకర్, ఎంపీటీసీ మంజుల శ్రీనివాస్, ఉపసర్పంచ్ అవిరె పద్మ, ఎంపీఓ సంజీవ, పంచాయతీ కార్యదర్శి ఉమ, ఉపాధ్యాయులు, మహిళా సంఘాల సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం మండల వ్యాప్తంగా 17 గ్రామ పంచాయతీల్లో పల్లె ప్రగతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కుంచమర్తిలో ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్, సర్పంచ్ ఉగ్గం ఉపేంద్రలింగరాజు, రామన్నగూడెం, జాజిరెడ్డిగూడెంలలో జిల్లా వ్యవసాయ అధికారి రామారావునాయక్, మండల ఏఓ శ్రీధర్‌రెడ్డి, ఎంపీఓ ఉపేందర్‌రావు, సర్పంచ్ పీరమ్మ, అర్వపల్లిలో సర్పంచ్ బైరబోయిన సునీతారామలింగయ్య గ్రామ పంచాయతీ కార్మికులను సన్మానించారు. వివిధ గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో సర్పంచ్‌లు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : పల్లె ప్రగతి దినోత్సవాన్ని శుక్రవారం మండల పరిధిలోని గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద జాతీయ జెండాలను ఆవిష్కరించారు. గ్రామ సభలు నిర్వహించి పల్లె ప్రగతి నివేదికలను గ్రామస్తులకు వినిపించారు. ర్యాలీ నిర్వహించారు. నూతన గ్రామ పంచాయతీ భవనాలకు శంకుస్థాపనలు చేశారు. గ్రామ పంచాయతీ సిబ్బందిని ఘనంగా సన్మానించి ప్రశంసాపత్రాలు అందజేశారు. తొండ గ్రామంలో ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత, జెడ్పీటీసీ దూపటి అంజలి, సర్పంచ్ ఎస్.శాతవాహనరావు, ఎంపీడీఓ ఉమేష్‌చారి, పంచాయతీ అధికారి మారయ్య, కార్యదర్శి యాకూబ్‌రెడ్డి, ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ పాలనలో గ్రామాలు అభివృద్ధి

సూర్యాపేట రూరల్ : ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రంలో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ జీడి భిక్షం అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాల్లో భాగంగా గురువారం ఇమాంపేట గ్రామంలో పల్లె ప్రగతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు డప్పులు కొట్టుకుంటూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శిరీష, ఎంపీడీఓ శ్రీనివాసరావు, సర్పంచ్ పాముల ఉపేందర్, ఎంపీటీసీ మామిడి కిరణ్, సీడీపీఓ కిరణ్మయి, ఏఓ జానిమియా, ఏపీఎం వెంకన్న, ఏపీఓ వెంకన్న, పంచాయతీ కార్యదర్శి సునీల్, బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు నగిరె సుదర్శన్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పల్లె ప్రగతితో గ్రామాల అభివృద్ధి

పెన్‌పహాడ్ : పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా గ్రామాలు అభివృద్ధి చెందాయని ఎంపీడీఓ బాణాల శ్రీనివాస్ అన్నారు. గురువారం తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పల్లె ప్రగతి దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. పల్లె ప్రగతి ద్వారా చేపట్టిన కార్యక్రమాలతో పల్లెల్లో రూపురేఖలు మారిపోయాయని ఆయన తెలిపారు. గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయాల ఎదుట సర్పంచ్‌లు జాతీయ జెండాలను ఎగురవేశారు. అనంతరం గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులను ప్రశంసపత్రాలు అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు మామిడి రేవతిపరందాములు, ఎంపీవో నరేష్, పంచాయతీ కార్యదర్శి రాజేష్, కట్ల నాగార్జున, మైసయ్య, నాగార్జున, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పల్లెల రూపురేఖలు మార్చడమే ప్రభుత్వ లక్ష్యం

నూతనకల్ : పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా పల్లెల రూపురేఖలు మార్చి అభివృద్ధి పర్చడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీఓ ఇందిర అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని గ్రామాల్లో నిర్వహించిన పల్లె ప్రగతి దినోత్సవం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని ఆమె తెలిపారు. గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. సర్పంచ్‌లు గ్రామ పంచాయతీ కార్యాలయాల ఎదుట జాతీయ జెండాలు ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల : మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పల్లెప్రగతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. పారిశుద్ధ్య కార్మికులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు,పాల్గొన్నారు.

నాగారం : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని వివిధ గ్రామాల్లో పల్లెప్రగతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని గ్రామపంచాయతీల ఆవరణలో సర్పంచ్‌లు జాతీయ జెండాలను ఆవిష్కరించి, ర్యాలీ నిర్వహించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులను సన్మానించి, దుస్తులను పంపిణీ చేసి, ప్రశంసపత్రాలను అందజేశారు. అలాగే గ్రామ పంచాయతీ కార్మికులకు అవసరమైన పనిముట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కూరం మణివెంకన్న, వైస్ ఎంపీపీ గుంటకండ్ల మణిమాల, తహసీల్దార్ హరిశ్చంద్రప్రసాద్, ఎంపీడీఓ జి.శోభారాణి, పీఆర్ డీఈఈ కొండయ్య, ఇరిగేషన్ డీఈఈ పిచ్చయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ చందన, సుపరింటెండెంట్ ముత్తయ్య, సర్పంచ్‌లు యారాల నర్సింహారెడ్డి, వేర్పుల సాలయ్య, మాల్యాల ఈశ్వరమ్మ, పసుపులేటి ప్రేమలతవెంకట్‌రెడ్డి, కుంటపల్లి సుధాకర్, నాగుల్‌మీరా, తీగుళ్ల స్వరూప ప్రశాంత్, పేరాల సరితయాదగిరి, బోయిని శోభాలింగమల్లు, చిప్పపల్లి స్వప్న, బిళ్ల పుష్పమాల, కుంభం కర్ణాకర్, గట్టు నర్సింహారావు, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, కార్యదర్శులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

చివ్వెంల : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో గురువారం తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పల్లెప్రగతిలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ ఆయా గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకం

ఆత్మకూర్ (ఎస్) : గ్రామాల అభివృద్ధిలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకమని సర్పంచ్ ముల్కలపల్లి రవి అన్నారు. పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా గురువారం నసీంపేటలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో పారిశుద్ధ్య కార్మికులు కీలకపాత్ర పోషిస్తున్నారని అన్నారు. అదే విధంగా మండల వ్యాప్తంగా అన్ని గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు, వివిధ శాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


తుంగతుర్తిలో ఈ-పంచాయతీ ఆపరేటర్లను సన్మానిస్తున్న ఎంపీపీ కవిత


అర్వపల్లి : కుంచమర్తిలో పల్లెప్రగతి వేడుకల్లో మాట్లాడుతున్న ఎంపీపీ మన్నె రేణుక


తిరుమలగిరి : తొండ గ్రామంలో పారిశుద్ధ్య సిబ్బందిని సన్మానిస్తున్న నాయకులు, అధికారులు


పెన్‌పహాడ్ : అనంతారంలో పారిశుద్ధ్య సిబ్బందిని సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు


మద్దిరాల : కుక్కడంలో పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న సర్పంచ్ కొమరయ్య, తదితరులు


నాగారం : డి.కొత్తపల్లిలో పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న వైస్ ఎంపీపీ మణిమాల


చివ్వెంల : ఐలాపురం గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు


అర్వపల్లి : రామన్నగూడెంలో ర్యాలీలో పాల్గొన్న డీఏఓ రామారావునాయక్, మండల అధికారులు

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి


తిమ్మాపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులను చేర్చుకుంటున్న ఉపాధ్యాయులు

అర్వపల్లి : తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాల్లోనే చేర్పించాలని తిమ్మాపురం కాంప్లెక్స్, జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.రవీందర్ కోరారు. గురువారం పాఠశాలలో 6వ తరగతిలో కొత్తగా 12 మంది విద్యార్థులను చేర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మన ఊరు–మనబడి ద్వారా అన్ని వసతులు సమకూరుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో పీఎస్ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం బింగి శ్రీనివాస్, ఉపాధ్యాయులు వి.కృష్ణయ్య, మురళీకృష్ణ, శీనయ్య, అలీ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు ఉద్యమం

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ


పూజలు చేస్తున్న మంద కృష్ణమాదిగ

చిలుకూరు : చిలుకూరులోని హరిజనవాడలో నూతనంగా నిర్మించిన సత్తెమ్మ దేవాలయాన్ని గురువారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధించేంత వరకు ఉద్యమం చేస్తామన్నారు. కాగా చిలుకూరు హరిజనవాడకు వచ్చిన మంద కృష్ణమాదిగకు నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు కోటేష్ మాదిగ, మండల అధ్యక్షుడు మల్లెంపంగు సురిబాబు, జిల్లా, మండల నాయకులు సిద్దెల శ్రీను, రామకృష్ణ, నూకపంగు వెంకటి, కందుకూరి లచ్చయ్య, కందుకూరి రాకేష్, వీరబాబు, అమరారపు ఉపేందర్, పాపయ్య, గురవయ్య, వెంకటి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

దరఖాస్తు గడువు పొడిగించాలి

తిరుమలగిరి : రాష్ట్ర ప్రభుత్వం కుల వృత్తుల వారికి అందజేయనున్న రూ.1 లక్ష ఆర్థికసాయానికి గానూ దరఖాస్తుల గడువును పొడిగించాలని భారతీయ జనతా పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వై.దీన్‌దయాళ్ కోరారు. గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కుల వృత్తుల వారు ధ్రువపత్రాల కోసం తహసీల్దార్ కార్యాలయం, మీసేవా కేంద్రాలకు వెళ్తే సర్వర్లు పనిచేయక అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అధికారులు స్పందించి మరికొన్ని రోజులు గడువు పెంచాలని కోరారు.

కల్నల్ సంతోష్‌బాబును ఆదర్శంగా తీసుకోవాలి

కోదాడఅర్బన్ : నేటి యువత కల్నల్ సంతోష్‌బాబును ఆదర్శంగా తీసుకోవాలని పలువురు పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు అన్నారు. గురువారం కోదాడలో సంతోష్‌బాబు మూడవ వర్ధంతిని కోదాడ ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కల్నల్ సంతోష్ బాబు సతీమణి సంతోషి, ఆమె పిల్లలు, కుటుంబ సభ్యులతో కలిసి కోదాడలోని కల్నల్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు మాట్లాడారు. దేశ సరిహద్దుల్లో సైనికుల త్యాగ ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛగా బతుకుతున్నామన్నారు. సంతోష్‌బాబు విగ్రహాన్ని కోదాడలో ఏర్పాటు చేసేందుకు అహర్నిశలు కృషి చేసిన విగ్రహం ఏర్పాటు కమిటీ అధ్యక్షుడు జగనీప్రసాద్‌ను, వాసవీ యూత్ క్లబ్ సభ్యులను సంతోష్‌బాబు సతీమణి సంతోషి అభినందించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు సత్యబాబు, వెంకటనారాయణ, శ్రీధర్, వాసవీ, యూత్ క్లబ్, ఆర్య వైశ్య సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా ఫాగింగ్ యంత్రాలు

- గ్రామాల్లో దోమల బెడదతో ప్రజల ఇబ్బందులు
- నిధుల లేమితో కొరవడిన ఫాగింగ్ యంత్రాల నిర్వహణ


ధర్మాపురంలో ఫాగింగ్ చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు(ఫైల్)

పెన్‌పహాడ్ : రానున్నది సీజనల్ వ్యాధుల కాలం.. దానికి తోడు పల్లెల్లో పారిశుద్ధ్యం లోపిస్తే ఇంకేమైనా ఉందా? తలుచుకుంటేనే భయం వేస్తుంది. వర్షా కాలం వస్తుందంటే ముందుగా పల్లెల్లో దోమల నివారణకు ప్రాధాన్యం ఇస్తూ చేపట్టే ప్రక్రియ ఫాగింగ్. కానీ నిర్వహణ సరిగాలేక ఫాగింగ్ యంత్రాలు మూలనపడడంతో పల్లెల్లో దోమల బెడద అధికమై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో దోమల నియంత్రణ, నివారణకు ప్రభుత్వం గతంలో పంచాయతీలకు సొంత నిధులతో ఫాగింగ్ యంత్రాలను సమకూర్చుకునేందుకు అవకాశం కల్పించింది. అయితే నిర్వహణకు నిధుల కొరత, మరమ్మతులకు సాంకేతిక సిబ్బంది అందుబాటులో లేకపోవడం తదితర కారణాలతో చాలా గ్రామాల్లో యంత్రాలు నిరుపయోగంగా మారాయి.

నాలుగు గ్రామాల్లో యంత్రాలు..

కరోనా అనంతరం ప్రభుత్వం గ్రామ పంచాయతీల్లో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంది. మురుగు కాల్వల్లో, నీరు నిల్వ ప్రదేశాల్లో దోమల సంతానోత్పత్తిని అరికట్టేందుకు పొగ రూపంలో వాటిని నియంత్రించేందుకు ఫాగింగ్ యంత్రాలను కొనుగోలు చేయించింది. మండలంలో 29 గ్రామ పంచాయతీలు ఉండగా అందులో ధర్మాపురం, అనంతారం, అన్నారం బ్రిడ్జి, చెట్లముకుందాపురం పంచాయతీల్లో ఫాగింగ్ యంత్రాలు కొనుగోలు చేశారు. పంచాయతీ నిధులతో ఒక్కో యంత్రానికి సుమారు రూ. 50వేల వరకు వెచ్చించారు. పారిశుద్ధ్య సిబ్బంది పెట్రోల్, డీజిల్‌ను వినియోగించి దోమల నివారణకు ఫాగింగ్ చేసేవారు. గ్రామం మొత్తం ఫాగింగ్ చేసిన ప్రతిసారి రూ. 2వేల వరకు ఖర్చు అవుతుంది. కొంత కాలం వరకు బాగానే పనిచేసిన యంత్రాలు తర్వాత మొరాయించాయి. మరమ్మతులకు వేల రూపాయాలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. దీంతో నిధుల లేమి కారణంగా మరమ్మతులు చేయించలేకపోవడంతో యంత్రాలు మూలనపడ్డాయి.

యంత్రాలను వినియోగంలోకి తెస్తాం



"దోమల నివారణకు కొన్ని గ్రామ పంచాయతీల్లో అక్కడి నిధులతోనే ఫాగింగ్ యంత్రాలను కొనుగోలు చేశారు. యంత్రాలు పనిచేయకపోవడం కారణంగా కొన్ని పల్లెల్లో మూలనపడ్డాయి. నిరుపయోగంగా ఉన్న వాటిని వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటాం.

- బాణాల శ్రీనివాస్, ఎంపీడీఓ

పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలి

చివ్వెంల : బి.చందుపట్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం డెమోక్రటిక్ స్టూడెంట్ ఆర్గనైజేషన్ (డీఎస్‌ఓ) విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పాఠశాలలో మరుగుదొడ్లు, మూత్రశాలలు, తరగతి గదులు సరిగా లేక విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు. తరగతి గదుల్లో పాత సామన్లు పెట్టడం వల్ల విద్యార్థులు ఆరు బయట కూర్చుంటున్నారన్నారు. అధికారులు స్పందించి వెంటనే సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు భాష్పంగు సునీల్, బచ్చలకూరి వెంకటేష్, సుమన్, నరేందర్, మధుసూదన్, గోపి పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

దురాజ్‌పల్లి : శ్రీవీరభద్రస్వామి రజక సహకార సంఘం ఇస్త్రీ షాపుల యూనియన్ పట్టణ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన నెల్లుట్ల సోమయ్య ఎన్నికయ్యారు. ఈ మేరకు గురువారం జిల్లాకేంద్రంలోని చంద్ర పుల్లారెడ్డి విజ్ఞానకేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన సోమయ్య మాట్లాడారు. సూర్యాపేటలో ఇస్త్రీ షాపుల యూనియన్ ఇంతవరకు లేదని, రజక సంఘాలను కలుపుకుని ఈ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కమిటీ హాల్ ఏర్పాటుకు త్వరలోనే మంత్రి జగదీశ్‌రెడ్డిని కలవనున్నట్లు పేర్కొన్నారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్క సభ్యుడికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఎం.శ్రీను, కార్యదర్శి జానయ్య, కార్యవర్గ సభ్యులు ఎం.అశోక్, రాచూరి సైదులు, కృష్ణ, పద్మ, నాగయ్య, గోపయ్య, కనకయ్య, శంకర్, అంజయ్య, మంగమ్మ, సైదులు తదితరులు పాల్గొన్నారు.

నేడు మహాప్రస్థానంలో దశాబ్ది ఉత్సవాలు

- వినూత్నంగా జరిపేందుకు నిర్ణయం
- హాజరుకానున్న మంత్రి జగదీష్ రెడ్డి

సూర్యాపేట : రాష్ట్ర అవతరణ దినోత్సవ దశాబ్ది వేడుకల్లో భాగంగా జరిగే పట్టణ ప్రగతి సంబురాలను వినూత్నంగా జరపాలని అధికారులు నిర్ణయించారు. రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన మహాప్రస్థానం శ్మశానవాటికలో ఈ వేడుకలు జరపతలపెట్టారు. చివరి మజిలీకి చిరునామా అయిన శ్మశానవాటికను ఆహ్లాదాన్ని అందించే ప్రదేశంగా నిర్మించారు. ఇదే మహాప్రస్థానంతో పాటు సూర్యాపేటలో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు రాష్ట్ర స్థాయి అవార్డు ప్రకటించిన నేపథ్యంలో ఇక్కడ జరుగుతున్న పట్టణ ప్రగతి సంబరాలకు ప్రాధాన్యం సంతరించుకుంది.

సోలిపేట పాల సొసైటీ చైర్మన్‌గా సురేందర్‌రెడ్డి


ధ్రువ పత్రాన్ని అందుకుంటున్న సురేందర్‌రెడ్డి

సూర్యాపేట రూరల్ : మండల పరిధిలోని సోలిపేట గ్రామం పాల సొసైటీ చైర్మన్‌గా చల్లా సురేందర్‌రెడ్డిని పాల సొసైటీ సభ్యులు గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సురేందర్‌రెడ్డి ఎన్నిక కావడం ఇది 7వ సారి. ఈ సందర్భంగా సురేందర్‌రెడ్డి ధ్రువ పత్రం తీసుకొని మాట్లాడారు. పాల ఉత్పత్తి పెంచడమే కాకుండా పాడి రైతుల సమస్యలను పరిష్కరించి, ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పాల సొసైటీ కో ఆప్షన్ సభ్యుడిగా కందుల కుశలవరెడ్డి, డైరెక్టర్లుగా మారం శేషరెడ్డి, సల్లా పుల్లారెడ్డి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో పాడి రైతులు చల్లా రాఘవరెడ్డి, కందుల అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీకి రాజీనామా

దురాజ్‌పల్లి : బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు నియంత పోకడల కారణంగా అవమానాలకు గురై పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, జిల్లా కార్యాలయ కార్యదర్శి పదవికి రాజీనామా చేస్తున్నట్లు సీనియర్ బీజేపీ నాయకుడు కొండేటి ఏడుకొండలు తెలిపారు. గురువారం పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొందరి మాటలు విని సంకినేని సీనియర్ నాయకులను విస్మరిస్తున్నారని అన్నారు. త్వరలోనే మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరనున్నట్లు తెలిపారు.

ఐలమ్మ మృతికి సంతాపం

పెన్‌పహాడ్: అన్నారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు వీరబోయిన సైదులు మాతృమూర్తి ఐలమ్మ (66) అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దొంగరి యుగేందర్ సందర్శించి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మామిడి అంజయ్య, యగ్గడి మురళి, వీరబోయిన రవి, సైదులు, దొంగరి సుధాకర్, పుల్లెంల పాపయ్య, భార్గవ్, మీసాల లింగయ్య, సొదయ్య పాల్గొన్నారు.

మహేష్ మృతికి సంతాపం

మద్దిరాల : కుంటపల్లికి చెందిన గుండ్ల మహేష్ మృతి చెందడంతో బీజేవైఎం రాష్ట్ర అధికా ర ప్రతినిధి సంకినేని వరుణ్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు గురువారం వేరు వేరుగా ఆయన మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి వెంట బీజేపీ మండల అధ్యక్షుడు భూతం సాగర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు రేటినేని శ్రీనివాస్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం


ర్యాలీ నిర్వహిస్తున్న ఏఎస్‌ఐ, తదితరులు

మునగాల : సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మునగాల ఏఎస్‌ఐ కృష్ణమూర్తి కోరారు. గురువారం మండలంలోని బరాఖత్‌గూడెంలో పలువురు గ్రామపెద్దలు, యువత సాయంతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని తెలిపారు. కొందరు నేరగాళ్లు ఆన్‌లైన్‌లో మోసాలకు పాల్పడుతున్నారని అన్నారు. సైబర్ నేరం జరిగితే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.